

తుర్కయంజాల్ సహకార సంఘానికి చెందిన గోదాంలో మొక్కలు నాటుతున్న యూపీ, తమిళనాడు సహకార కమిషనర్లు

తుర్కయంజాల్ సహకార సంఘాన్ని సందర్శించిన యూపీ, తమిళనాడు సహకార కమిషనర్లు

హయత్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సహకార సమ్మిట్‌లో భాగంగా గురువారం ఉత్తరప్రదేశ్ సహకార రిజిస్ట్రార్, కమిషనర్ యోగేష్‌కుమార్, తమిళనాడు సహకార రిజిస్ట్రార్, కమిషనర్ కె. నంతకుమార్ తుర్కయంజాల్‌లోని రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు సంఘం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సత్తయ్యను అడిగి తెలుసుకున్నారు. సంఘ సభ్యులు పొందుతున్న సేవలను తెలుసుకున్నారు. సంఘం పని తీరును వారు అభినందించారు. అనంతరం కొహెడాలో ఉన్న సంఘం గోదాం, కోల్డ్‌స్టోరేజీని సందర్శించారు. ఈ సందర్భంగా గోదాం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీసీఓ సుధాకర్, సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, సంఘం సెక్రటరీ రాందాసు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం : కార్పొరేటర్లు



మాట్లాడుతున్న కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతోనే బీఎన్‌రెడ్డినగర్‌లోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, రాగుల వెం కటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ఫారెస్ట్‌రేంజ్ కార్యాలయంలో అటవీశాఖ, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాగర్ కాంప్లెక్స్‌లో పలు విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్లు డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి సంబంధించిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న మధుయాష్కీగౌడ్ చొరవతో ఈ సమస్య పరిష్కారానికి రూ.1.06 కోట్ల నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ పనులను రెండు రోజులుగా తాము సంబంధిత అధికారులతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చేయడం జరిగిందన్నారు.

బాలాపూర్ గణపయ్య సేవలో పారిశుధ్య కార్మికులు



మాజీ మేయర్ పారిజాతారెడ్డితో కలిసి బాలాపూర్ వినాయకుడి పూజల్లో బడంగ్‌పేట్ మునిసిపల్ పారిశుధ్య కార్మికులు

సరూర్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన పారిశుధ్య కార్మికులు గురువారం బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరితో కలిసి వారు గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి వారిని సన్మానించి ప్రసాదం అందజేశారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ బాలాపూర్ బడా వినాయకుడిని దర్శించుకోవడం ఆనందంగా ఉన్నదని, తమ కార్పొరేషన్ పరిధిలోని విఘ్నేశ్వరుడికి ఇంతటి పేరు ప్రఖ్యాతులు రావడం గర్వకారణంగా ఉన్నదని అన్నారు. కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నిరంజన్‌రెడ్డికి బీజేపీ నేతల సన్మానం

సరూర్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నిత్యం బాలాపూర్ గణనాథుడి దర్శనానికి వచ్చే అతిథులను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి వారికి స్వామి వారి లడ్డూ ప్రసాదం అందజేసే బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఎంతో ఓపిక గల ఉత్సవ నిర్వాహకుడని బీజేపీ రాష్ట్ర నాయకుడు, 2024 లడ్డూ విజేత కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన బీజేపీ నాయకులు గడ్డం వెంకటేశ్, జోరల ప్రభాకర్, గుండె నాగార్జున బాబు, దొడ్డి శ్రీశైలం తదితరులతో కలిసి బాలాపూర్ గణేశ్ మండపాన్ని సందర్శించి నిరంజన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డి మాట్లాడుతూ వేలాదిగా బాలాపూర్‌కు తరలివస్తున్న భక్తులకు నిరంజన్‌రెడ్డి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, నిర్విఘ్నంగా వినాయకుడి దర్శన భాగ్యం కల్పిస్తున్నారని ప్రశంసించారు. కాగా ఇది తనకు ఆ విఘ్నేశ్వరుడే కల్పించిన మహాదావకాశమని, అంతా ఆ స్వామి దయ అని నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కార్మికులు ఈశ్రమ్ కార్డు ప్రయోజనాలు పొందండి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మికశాఖ ప్రవేశపెట్టిన ఈశ్రమ్ కార్డు ప్రయోజనాలను అసంఘటిత రంగ కార్మికులు పొందాలని సీపీఐ మండల కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్ సూచించారు. గురువారం నగర శివారు బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో బీకేఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశ్రమ్ కార్డు అవగాహన సదస్సులో హరిసింగ్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసంఘటిత రంగ కార్మికులు ఈశ్రమ్ కార్డును పొందడం మూలంగా ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.2లక్షల బీమా, గాయపడితే రూ. 1లక్ష ఆర్థిక సాయం వస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈశ్రమ్ కార్డు తీసుకుని ప్రయోజనాలు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారి ప్రమీల, నర్సింహ, రాములు, షరీఫ్, శంకర్‌నాయక్, పోషయ్య పాల్గొన్నారు.


ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ తొలగింపు హర్షణీయం

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలపై జీఎస్టీ తొలగిస్తే కొన్ని లక్షల మందికి లాభం చేకూరుతుందని జనరల్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఇంటిగ్రేటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాపోలు సుధాకర్ అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన ఎల్‌ఐసీ కెరీర్ ఏజెంట్స్ అసోసియేషన్ సమావేశంలో జీఎస్టీ తొలగింపు నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 2017సంవత్సరం నుంచి జీఎస్టీ తొలగింపు కోసం పలు సార్లు కేంద్రమంత్రులను కలిసి చేసిన విన్నపాలు ఫలించాయన్నారు. జీఎస్టీ తొలగింపుకు సహకరించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ధన్యవాదాలు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : రాచపుడి

కొత్తపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. గురువారం రామాంతపూర్ జెడ్పీహెచ్‌ఎస్ నుండి రెండో రోజు 40మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది రమేశ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ వీడియోలను, రైమ్స్‌ను ప్రదర్శించారు. పార్కు ఆవరణలో నిబంధనల చిత్రాలను, రోడ్డు సైన్స్‌ను, సిగ్నల్ వ్యవస్థ నమూనాను చూపించారు. పార్కు ఆవరణలో విద్యార్థులు హెల్మెట్‌లు పెట్టుకుని సైకిళ్లు తొక్కారు.

హెల్మెట్, సీటుబెల్టు పెట్టుకోవడం మరువరాదు



జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్

కొత్తపేట : వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోవడం మరువరాదని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. గురువారం వివిధ ప్రాంతాల్లో, విద్యాసంస్థల్లో 750మంది విద్యార్థులకు, కూడళ్లలో వాహనదారులకు టీటీఐ ఆర్‌ఎస్‌ఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ నర్సింహారావు, ఏఎస్‌ఐ సోమ్‌నాథ్, సిబ్బంది రమేశ్ ట్రాఫిక్ నిబంధనలను పరిచయం చేశారన్నారు. 15 అవగాహన కార్యక్రమాలు చేశారని ఆయన తెలిపారు. మీర్‌పేట, బడంగ్‌పేట, ఎల్బీనగర్, సరూర్‌నగర్ పరిధిల్లో వీడియోలను ప్రదర్శిస్తు అవగాహన కల్పించారని ఆయన పేర్కొన్నారు.



ఓల్డ్‌మలక్‌పేట రేస్‌కోర్సు రోడ్డులో గణపతి వద్ద పూజల్లో కాంగ్రెస్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు



హస్తినాపురం డివిజన్‌లోని సప్తగిరిహిల్స్ కాలనీలో పూజల్లో కార్పొరేటర్ సుజాతానాయక్, నాయకులు



చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో వినాయక పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఈఓ ఎన్.లావణ్య, ధర్మకర్తలు



హయత్‌నగర్ సౌజన్యనగర్‌కాలనీలో గణనాథుడి పూజల్లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, తాడిచెట్టు సునీల్‌గౌడ్, చెన్నగోని రవీందర్‌గౌడ్, నక్క రాజేష్‌గౌడ్



వివేకానందనగర్‌లో వినాయక పూజల్లో పాల్గొన్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, టీడీపీ ఎల్బీనగర్ ఇన్‌చార్జి వెంకట్ గాంధీ, సునీల్‌బాబు



ఆటోనగర్‌లో మెకానిక్ అసోసియేషన్ గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, సభ్యులు

ఘనంగా గణేశ్ నవరాత్రులు

గణపతి నవరాత్రులను దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, మలక్‌పేట, సరూర్‌నగర్, సంతోష్‌నగర్, సైదాబాద్, కర్మన్‌ఘాట్, కొత్తపేట, వనస్థలిపురం, మన్సూరాబాద్, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, మూసారాంబాగ్, అక్బర్‌బాగ్ తదితర ప్రాంతాల్లో నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందంగా అలంకరించిన మండపాలలోని గణేశుడికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, అధికారులు గణనాథుల మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. ఓల్డ్‌మలక్‌పేట రేస్ కోర్సు రోడ్డు మోడల్ మార్కెట్ ఎదుట వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద గురువారం స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు.

జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి



సరూర్‌నగర్‌లో గణనాథుడిని దర్శించుకున్న బీజేపీ రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్ అందెల శ్రీరాములుయాదవ్, ఆకుల అంజన్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి



ఆర్‌కేపురంలో పూజల్లో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, ధీరజ్‌రెడ్డి, కార్పొరేటర్ రాధారెడ్డి



గడ్డిఅన్నారం గౌడబస్తీలో గణపయ్యకు పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్లు భాగ్యలక్ష్మీరెడ్డి, అరుణారెడ్డి, నిర్వాహకులు గొట్టిపర్తి శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌గౌడ్

సామూహిక నిమజ్జనానికి 12వేల మంది పోలీస్ సిబ్బంది

- రాచకొండ పరిధిలో 58 నిమజ్జన ప్రాంతాలు
- 20వేల విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశం



సరూర్‌నగర్ చెరువుకట్టపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ సుధీర్‌బాబు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): సామూహిక నిజ్జనం ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్‌పై నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బందోబస్తు వివరాలను వెల్లడించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 58 నిమజ్జన ప్రాంతాల్లో సుమారు 12,000 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపడుతున్నట్లు వివరించారు. గత సంవత్సరం కంటె 30శాతం ఎక్కువగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చే అవకాశాలున్నట్లు తెలిపారు. రాచకొండ పరిధిలోని చెరువులు, నీటి కొలనుల్లో సుమారు 20వేల విగ్రహాలు నిమజ్జనానికి రానున్నట్లు వెల్లడించారు. నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిఘా నేత్రం కనుసన్నల్లో నిమజ్జనం సాగేలా చర్యలు చేపట్టామన్నారు. షీటీమ్స్, ఎస్‌వోటీ బృందాలు మఫ్టీలో ప్రత్యేక నిఘా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. భద్రతా సిబ్బందికి కూడా అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. నిమజ్జన విగ్రహం ఉన్న వాహనాలు మాత్రమే సరూర్‌నగర్ చెరువుకట్టపై అనుమతించడం జరుగుతుందన్నారు. నిమజ్జనం సాఫీగా ముగిసేందుకు భక్తులు, ఉత్సవ సమితి నిర్వాహకులు సహకరించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం వనస్థలిపురం రైతుబజార్ నుంచి ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటరమణకాలనీలకు మంజూరైన లింకు రోడ్లను కార్పొరేటర్‌తో కలిసి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇంజాపూర్‌లో రోడ్డు మరమ్మతులు చేపట్టండి

హయత్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంజాపూర్ కమాన్ నుంచి బచ్‌పన్ పాఠశాల వరకు గుంతలుపడిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతూ గ్రామానికి చెందిన బొక్క వంశీధర్‌రెడ్డితో పాటు పలువురు గురువారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ కె. అమరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని తెలిపారు. నిత్యం వందలాది వాహనాలు తిరగడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని, అందులో నీరుచేరి ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. గుంతలమయంగా మారిన రోడ్డు వల్ల ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే రోడ్డు మరమ్మతులు చేయించాలని కమిషనర్‌ను కోరారు. బుచ్చిరెడ్డి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్య పరిష్కారానికి కృషి

మన్సూరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగోల్‌లో వృత్తిపరంగా నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. తమ కులానికి చెందిన వృత్తిని ముస్లింలు, ఇతరులు చేపడుతుండటంతో తమ ఉపాధికి తీవ్ర దెబ్బపడుతోందని, ఇతరులు తమ వృత్తి చేపట్టకుండా చూడాలని నాగోల్ డివిజన్ నాయీబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు గురువారం సురేంద్రనాథ్‌యాదవ్‌ను కలిసి విన్నపించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ సామ రమణారెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని ఎస్‌జీఆర్‌కాలనీలో ఉన్నం రమేశ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు చికెన్ సెంటర్ నిర్వాహకులు ఉన్నం వేణుబాబు ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి వారి సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మాజీ కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 500 మందికి స్త్రీ సంబంధిత వ్యాధులు, బీపీ, షుగర్, టుడీ ఎకో, వంటి పరీక్షలను వైద్యులు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు బెక్కం లక్ష్మీనారాయణ, ప్రకాష్, భానుక రమేష్, విజయ్‌బాబు, అశోక్‌రాజు పాల్గొన్నారు.

కామినేని ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

- నిద్రలో మహిళ ఊపిరితిత్తుల్లో ఇరుక్కున్న కరక్కాయ
- బ్రాంకోస్కోపీ ద్వారా రాట్‌టూత్ పరికరంతో తొలగించిన వైద్యులు



విజేత ఊపిరితిత్తుల్లో నుంచి తొలగించిన కరక్కాయ

మన్సూరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దగ్గు వస్తోందని రాత్రి పడుకునే ముందు కరక్కాయను బుగ్గన పెట్టుకోవడం ఓ మహిళ ప్రాణాల మీదకు వచ్చింది. ముక్కుగుండా ఊపిరితిత్తుల్లోకి వెళ్లిన కరక్కాయతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా అరుదైన శస్త్ర చికిత్సతో కామినేని వైద్యులు ఆమెకు ప్రాణం పోశారు. ఆస్పత్రి పల్మనాలజీ విభాగ వైద్యులు డా.ఇ.రవీందర్, డాక్టర్ భరత్ జానపాటి వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌లోని వనస్థలిపురానికి చెందిన 57ఏళ్ల విజేత అనే మహిళకు తీవ్రంగా దగ్గు వస్తుండటంతో బుధవారం రాత్రి నిద్రించే సమయంలో దగ్గు రాకుండా కరక్కాయను చెంపపై పెట్టుకుని పడుకుంది. నిద్రలో ఉండగా ఆ కరక్కాయ ఆమె ముక్కు గుండా ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో తీవ్రంగా దగ్గు ఆయాసంతో ఇబ్బందిపడుతోంది. కుటుంబ సభ్యులు కామినేని ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన అక్కడి వైద్యులు కరక్కాయ ఎడమ ఊపిరితిత్తుల్లో ఉందని గుర్తించారు. వెంటనే శస్త్ర చికిత్స ప్రారంభించిన వైద్యులు ఆ కాయను రెండు ముక్కలుగా చేసి తొలగించి విజేతకు ప్రాణం పోశారు. పునఃర్జన్మ ప్రసాదించారంటూ ఆమె కుటుంబ సభ్యులు కామినేని వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అధికారులు

వనస్థలిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చేపడతామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాగర్ కాంప్లెక్స్ నుంచి హరిహరపురం వరకు భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జలమండలి డైరెక్టర్ శ్రీధర్, ఈఈ రమేశ్ బాబులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్నాళ్లుగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడతామన్నారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభించి త్వరిత గతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. ఈ మేరకు ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సైతం ఈ పనులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, జలమండలి అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను విద్యార్థులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం దాసిరి ప్రతాప్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సుజాతతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బాటసింగారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సంతోష్‌తో పాటు ఉపాధ్యాయులను గ్రామానికి చెందిన దండమోని గోపీ, నాగరాజు ఘనంగా సన్మానించారు.

చైన్ స్నాచర్ల అరెస్టు

- మూడున్నర తులాల బంగారు గొలుసు స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న వస్తువులతో ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, సిబ్బంది

మన్సూరాబాద్: రెండు రోజుల క్రితం ఓ వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును తస్కరించి పరారైన ఇద్దరు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ వివరాల ప్రకారం.. ఓల్డ్‌బోయిన్‌పల్లి అంజయ్యనగర్‌లో నివాసముంటున్న రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన క్యాబ్ డ్రైవర్ ముత్త బీరయ్య అలియాస్ అనిల్(32), దిల్‌సుఖ్‌నగర్‌లోని పీఅండ్‌టీకాలనీ సాహితినగర్‌లో నివాసముంటున్న సిద్దిపేట జిల్లా కొండపాక మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన డ్రైవర్ కమల శ్రీధర్(32) స్నేహితులు. ఈజీగా డబ్బులు సంపాదించాలని భావించిన వీరిద్దరు సోమవారం హయత్‌నగర్ మండలం గౌరెల్లి గ్రామంలో ఈరమ్మ అనే వృద్ధురాలి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును తస్కరించి పరారయ్యారు. కేసు నమోదు చేసుకున్న నాగోల్ పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించి అనిల్, శ్రీధర్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. నేరస్థులిద్దరినీ కోర్టులో హాజరుపరిచి అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి మూడున్నర తులాల బంగారు గొలుసుతో పాటు దొంగతనానికి ఉపయోగించిన పల్సర్ బైక్(టీఎస్10ఎఫ్‌బీ5239), రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్యలు అభినందించారు.



లడ్డూ అందజేస్తున్న సినీనటుడు సుమన్, ఎమ్మెల్సీ రాజేందర్, కళ్యాణ్, బీఆర్‌ఎస్ నాయకుడు అంకిరెడ్డి తదితరులు

గణేశ్ లడ్డూ వేలం రూ.1.11లక్షలు

చంపాపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ డిఫెన్స్‌కాలనీలోని హరిహరక్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి నవరాత్రులను పురస్కరించుకొని గురువారం నిర్వహించిన వేలం పాటలో స్వామి వారి లడ్డూను ఆలయ డైరెక్టర్ మిరియాల అంజయ్యగుప్తా రూ1.11లక్షలకు, గర్భగుడిలోని గణపతి లడ్డూను ఆలయ డైరెక్టర్ సద్ది సందీప్‌రెడ్డి రూ.55వేలకు, గణనాథుని కలశం, నోట్లదండను లింగాల దశరథ్‌గౌడ్ రూ.20,116వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, బ్రహ్మశ్రీ రమణ గురుస్వామి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అనిల్‌కుమార్‌కాలనీలో 1.10 లక్షలు

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ పంజాల అనిల్‌కుమార్ కాలనీలో గణపతి లడ్డూను రూ.1.10లక్షలకు వర్దిని కోటేశ్వర్ కైవసం చేసుకున్నారు. సినీనటుడు సుమన్, ఎమ్మెల్సీ బొగ్గారపు రాజేందర్, పట్లోల కళ్యాణ్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి వారికి లడ్డూ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయిని మహేందర్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు రిషి, సలీం పాల్గొన్నారు.

పోలీసుల చెంత మతిస్థిమితం లేని బాలుడు



మతిస్థిమితం లేని బాలుడు

హయత్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని 12సంవత్సరాల బాలుడిని హయత్‌నగర్ పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. గురువా రం మధ్యాహ్నం కుంట్లూర్ రోడ్డులో తిరుగుతుండగా పోలీసులు గమనించి బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలుడు కుటుంబ సభ్యుల వివరాలు కూడా చెప్పలేకపోతున్నాడని పోలీసులు తెలిపారు. బాలుడికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఉంటే హయత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని సీఐ నాగరాజుగౌడ్ కోరారు. ఇతర వివరాలకు 8712662640లో సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హయత్‌నగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని హయత్‌నగర్ పోలీసులు కనుగొన్నారు. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ సర్వీస్ రోడ్డు బస్టాప్ పక్కన ఉన్న నీటిగుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి(65) చనిపోయాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపైన లైట్ గ్రీన్ ఆఫ్ షర్టు, బ్లాక్ నిక్కర్ కలిగి ఉన్నాడని పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైన ఉంటే ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 8712662640లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సాయికిరణ్(ఫైల్)

వనస్థలిపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదాభక్షిపల్లికి చెందిన బొల్లారపు సాయికిరణ్(25) కొత్తపేటలో నివాసముంటు వనస్థలిపురంలోని నిషాబార్‌లో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి సాయికిరణ్ విధులు ముగించుకుని కొత్తపేటకు తన బైక్‌పై వెళ్తున్నాడు. చింతలకుంట సమీపంలోని షోరూం వద్ద ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన గుర్తు తెలియని లారీని వెనుక నుంచి సాయికిరణ్ బలంగా ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలతో రక్తస్రావమైన సాయికిరణ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించండి

సరూర్‌నగర్ : గణేశ్ నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయని, శనివారం వరకు ఉత్సవాలు కొనసాగనున్నందున ఉత్సవ నిర్వాహకులు, భక్తులు తగిన జాగ్రత్తలు పాటించి పండుగ సంబరాలను ప్రశాంతంగా ముగించుకోవాలని మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ సూచించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి నిమజ్జన శోభాయాత్రలు పెరిగాయని, శనివారం తుది ఘట్టం ఉన్నందున పోలీసు శాఖ తరఫున తమ వంతు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.